క్లుప్తంగా

పురుగు మందులు సురక్షితంగా వినియోగించాలి



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎన్విరో ఈక్విటీ హెల్త్ ఇన్షియేటీవ్ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జొన్నలగడ్డ గ్రామంలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఏడీఆర్ డాక్టర్ ఎస్వీవీపీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు పంటలపై పురుగు మందులు సురక్షితంగా వాడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సేవా సంస్థ ఫౌండర్ శ్రియ జొన్నకూటి మాట్లాడుతూ రైతులను అధునాతన విధానాలపై అప్రమత్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ దయానా మాట్లాడుతూ రైతులకు ఎక్కువగా ప్రోస్టేట్ క్యాన్సర్, చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయన్నారు. పరిధి మించి పురుగు మందులు పిచికారి చేయరాదన్నారు. భవిష్యత్తులో అనేక విధాలుగా నష్టం జరుగుతుందని తెలిపారు. ఆదర్శ రైతు వంగా నవీన్‌రెడ్డి, ఎం. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాలలో విద్యాబోధన జరుగుతుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఇసాఫ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది 2024–25 విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు 761 మంది విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందారని కళాశాల కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులకు ఏడాదికి రూ. 4.25 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ లభించిందన్నారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె. సురేష్‌బాబు, తదితరులు అభినందించారు.

పక్షుల ప్రేమికుడీ రైతు!



పెదకాకాని: ఏడేళ్లుగా నిత్యం పక్షులకు ఆహారం అందించడం అలవాటుగా చేసుకున్నారు గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన రైతు ఉయ్యూరు జగన్మోహనరావు. నిత్యం ఇంటి నుంచి పొలం వద్దకు పలు రకాల పదార్థాలు తీసుకువెళ్లి అందిస్తున్నారు. రోజూ పొలం వద్ద ఆయన కోసం అవి కూడా ఎదురు చూస్తూ ఉంటాయి.

రోగులకు భోజనం పెట్టేందుకు టెండర్లు

గుంటూరు మెడికల్: తెనాలి జిల్లా ఆస్పత్రిలో రోగులు, డ్యూటీలో ఉండే వైద్యులకు భోజనం పెట్టేందుకు అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థల నుంచి సీల్డ్ టెండర్లు ఆహ్వానించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఎం.మజీదాబి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 14వ తేదీ వరకు గుంటూరు పట్టాభిపురంలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో రూ.వెయ్యి చెల్లించి టెండరు ఫారం పొందాలన్నారు. టెండరు ఫారాలను పూర్తి చేసి 17వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు గుంటూరులో డీసీహెచ్ఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్, జిల్లా డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ భార్గవ్ తేజ ఆధ్వర్యంలో డైట్ టెండర్లు 17వ తేదీ ఓపెన్ చేస్తారని వెల్లడించారు.

పేరేచర్ల నుంచి విజయవాడకు బస్సు సర్వీసు

పట్నంబజారు: ప్రయాణికుల సౌకర్యార్థం పేరేచర్ల నుంచి గుంటూరు మీదుగా విజయవాడకు బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ తెలిపారు. మంగళవారం ఆర్టీసీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. గతనెల 27 నుంచి పల్లెవెలుగు సర్వీసులు పేరేచర్ల నుంచి పెదపలకలూరు, విజ్ఞాన్ కాలేజ్, గుజ్జనగుండ్ల, కొరిటిపాడు, లాడ్జిసెంటర్ మీదుగా బస్సు సర్వీసు నడపనున్నట్లు చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి గంట వ్యవధిలో ఒక బస్సును ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.

మైనింగ్‌లో రెచ్చిపోతున్న తమ్ముళ్లు

అధికారం అండతో తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూమి ఏదైనా సరే మైనింగ్ చేయాల్సిందే. రూ.లక్షలు దండుకోవాల్సిందే. ఎవరైనా అడ్డొస్తే బెదిరించడం పరిపాటిగా మారింది.

- రేయింబవళ్లు తేడా లేకుండా తవ్వకాలు
- ఒక్కో లారీ లోడు రూ.6 వేల నుంచి రూ.8 వేలు
- రియల్ ఎస్టేట్ వెంచర్లకు మట్టి రవాణా
- ప్రజాప్రతినిధి అండదండలతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- రూ.లక్షలు స్వాహా చేస్తున్న తమ్ముళ్లు
- ప్రభుత్వ, ప్రైవేట్ భూములనే తేడా లేకుండా మైనింగ్
- చోద్యం చూస్తున్న మైనింగ్, పోలీస్ శాఖ అధికారులు



తమ కాలనీలోనుంచి వాహనాలు రాకపోకలు సాగించవద్దని కోరుతూ ఆందోళన చేస్తున్న ప్రజలు

గుంటూరు రూరల్: నగర పరిసర ప్రాంతాల్లో మైనింగ్ విచ్చలవిడిగా సాగుతోంది. రూరల్ మండలంలో ఓబులునాయుడుపాలెం, పొత్తూరు, నాయుడుపేట, వెంగళాయపాలెం, చిన్నపలకలూరు, గోరంట్ల తదితర గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో మాఫియా అక్రమ మైనింగ్ సాగుతోంది. ప్రజా ప్రతినిధి అల్లుడు పేరుతో మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం. ఏకంగా ప్రజా ప్రతినిధి కార్యాలయం నుంచి ఒకరిద్దరు వచ్చి తవ్వకాలు జరిపే ప్రాంతంలో రాత్రి, పగలు తరలిస్తున్న వాహనాల లెక్కలు రాసుకుంటున్నారంటే ఏ స్థాయిలో మైనింగ్‌కు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తూ లారీ లోడు రూ.6 వేల నుంచి రూ. 8 వేల వరకు విక్రయిస్తున్నారు.



అక్రమంగా మైనింగ్ చేస్తున్న ప్రదేశం

అందరూ కలిసి ధనార్జన..

స్థానిక టీడీపీ నాయకులతో కలిపి ప్రజా ప్రతినిధులే ఇలా అక్రమ తవ్వకాలు చేస్తుండటం చర్చాంశనీయంగా మారింది. రెండు రోజుల క్రితం నాయుడుపేట పరిసర ప్రాంతాల్లోని కాలనీల వాసులు తమ ప్రాంతం నుంచి వాహనాలలో తరలిస్తూ తమకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కాలనీలో అణగారిన వార్గలకు చెదిన పేద ప్రజలు, ట్రాన్స్‌జెండర్స్ , ఇతర పేద ప్రజలు ఉంటున్నారు. ఆ కాలనీకి పక్కనే అడుగుల దూరంలో సుమారు 40–50 అడుగుల లోతులో తవ్వి మట్టి అమ్మకాలు చేస్తుండటంతో స్థానిక ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. కాలనీలోనుంచి మట్టి తరలించేందుకు తాము ఒప్పుకోమని తెలపగా, స్థానిక ప్రజలను పోలీసులు ఇతర వ్యక్తులతో బెదిరించారని సమాచారం. దీంతో చేసేదిలేక దిక్కులేని పరిస్థితుల్లో మిన్నకుండిపోయారు. అధికారులు స్పందించి అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సర్కారు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని



మాట్లాడుతున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరిని, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఏటుకూరు బైపాస్‌లోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్తిపాడు మండల ముఖ్య నాయకుల సమావేశంలో బలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. విభేదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అడిగిన వారిపై అక్రమ కేసులు బనాయించి ప్రజలను ఇబ్బందులు పెడుతున్న వైనాన్ని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రతి ఒక్కరికి తెలియజేసేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ కార్యకర్తలకు అండగా ఉంటూ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో కొనసాగుతున్న అక్రమాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మండలంలోని పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దిన దృశ్యం



విశేష అలంకరణలో స్వామి వారు

పొన్నూరు: పట్టణంలోని తెలగపాలెం శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో మహా కుంభాభిషేకం మహోత్సవం, సీతారాముల వారి కల్యాణ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహం, పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రాశన, వాస్తు పూజ, వాస్తుహోమం, ఉక్త హోమం, తీర్థ సంగ్రహణం, సాయంత్రం అగ్ని ధ్యానం, ఆరాధన, ఉక్త హోమాలు, కుంభ కళాన్యాసం, విశేష పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెన్నారెడ్డి విరచిత స్వప్న సాగరం నవల ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు, రత్నషీలామణి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగంలో ఆచార్యునిగా సేవలందిస్తున్న ప్రముఖ రచయిత ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి రచించిన 'స్వప్న సాగరం' నవలను వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు ఆవిష్కరించారు. వర్సిటీలో మంగళవారం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. తొలి ప్రతులను వర్సిటీ రెక్టార్ కే రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల ప్రాచార్యులు ఎం.సురేష్ కుమార్‌లకు అందించారు. వీసీ గంగాధరరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సర్వీస్ కమిషన్ గ్రూప్ వన్ ఉద్యోగాన్ని కాదని వర్సిటీలో ఆచార్యునిగా సేవలందిస్తూ తన రచనలతో సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న గుజ్జు చెన్నారెడ్డి సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. నేటి యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. చెన్నారెడ్డి రచనలు అందుకు ఎంతగానో దోహదం చేస్తాయని సూచించారు. రెక్టార్ రత్నషీలామణి మాట్లాడుతూ చెన్నారెడ్డి సాహిత్య రంగంలో చేస్తున్న రచనలు చారిత్రక పరిశోధనాత్మకంగా సాగుతూ వర్తమాన పరిస్థితులపై భవిష్య దిక్సూచిగా ఉంటాయని ప్రశంసించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ చెన్నారెడ్డి ఇప్పటికే 215 పరిశోధక వ్యాసాలు రాసి తన ఆధ్వర్యంలో 42 డాక్టరేట్లను పూర్తి చేయించారన్నారు. ఆచార్య ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ 'సిక్కోలు కథలు', 'మరో మహాత్మ', 'లండన్ టు అమరావతి' కాగా మూడవ నవల 'స్వప్న సాగరం' రచించారని తెలిపారు. రచయిత చెన్నారెడ్డి మాట్లాడుతూ విశాఖపట్టణంలో రవి సాగర్ అనే బీఏ చివరి సంవత్సరం విద్యార్థి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తన సహచర విద్యార్థులతో ఉన్న స్మృతులను చెప్పడమే ఈ స్వప్న సాగరం నవల నేపథ్యమని వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఏఈ కృష్ణ, డాక్టర్ బసవేశ్వరరావు, డాక్టర్ అచ్చిబాబు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నారాకోడూరులోని సీఎంఎస్ చిల్డ్రన్ హోంలో ప్లాంటేషన్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ పి.శ్రీనివాసబాబు మంగళవారం తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బుక్స్, ఇతర సామగ్రిని అందజేసామని చెప్పారు. కళాశాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

ఉర్దూ బాలుర కాలేజీ, హైస్కూల్లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఉర్దూ బాలుర జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థులు ఈనెల 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలలో సీట్లను ఏపీఆర్‌జేసీ సెట్ ద్వారా భర్తీ చేస్తామని, ఉన్నత పాఠశాలలో 5వ తరగతితో పాటు 6,7,8 తరగతుల్లో ఖాళీల భర్తీ కోసం ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ సైట్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. ఇతర వివరాలకు 87126 25073, 96525 69140 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ఎల్ఎల్ఎం కోర్సులు నిలిపివేయడం తగదు



నిరసన తెలియజేస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

ఏఎన్‌యూ: దశాబ్దాల చరిత్ర కలిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం న్యాయ విభాగం ద్వారా ఎందరో పేద విద్యార్థులు న్యాయ శాస్త్రం అభ్యసించి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థాయి చేరుకున్న ఘనత ఉన్న విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్ఎంలో కొన్ని కోర్సులను నిలివేయడం సరైంది కాదని పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ పరిరక్షణ జేఏసీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం యూనివర్సిటీ వీసీ చాంబర్ వద్ద నిరసన తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తును సమాధి చేయటం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో లా కోర్సులతో ముందుకు దూసుకుపోతుంటే, విశ్వవిద్యాలయం దానికి విరుద్ధంగా పయనిస్తూ కోర్సుల ఎత్తివేతకు కారణమవుతోందని ఆరోపించారు. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలను నెలకొల్పుతున్న కేంద్రంతో పాటు, ఆయా డీమ్డ్ యూనివర్సిటీలు ఎప్పటికప్పుడు పదుల సంఖ్యలో న్యాయ విద్యకు సంబంధించి పీజీ కోర్సులను రూపొందించి శిక్షణ అందిస్తున్నాయన్నారు. వందల సంఖ్యలో సర్టిఫికెట్ కోర్సులు సృష్టిస్తూ మార్కెట్లో విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని వెల్లడించారు. ఆయా సంస్థలు కోట్లాది రూపాయల ఆదాయాన్ని కూడా గడించే సంగతి సంబంధిత అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. న్యాయవిభాగాన్ని బలోపేతం చేసేలాగా తద్వారా పేద, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుల పరిశీలన

నెహ్రూనగర్: సబ్సిడీ రుణాల మంజూరు కోసం దరఖాస్తులు 3, 4 తేదీల్లో పరిశీలించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆన్ లైన్ బెనిఫిషియరీ మేనేజ్మెంట్ – మోనిటరింగ్ సిస్టం (ఓబీఎంఎంఎస్)లో తూర్పు నియోజకవర్గంలో ఈ నెల 3వ తేదీ బ్రహ్మానందరెడ్డి స్టేడియం, పశ్చిమ నియోజకవర్గంలో 4వ తేదీ ఎన్టీఆర్ స్టేడియంలో, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 7వ తేదీ అమరావతి రోడ్ నవీన స్కూల్‌లో పరిశీలన క్యాంప్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కాపీ, విద్యార్హత, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్ ల జిరాక్స్ కాపీలు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫొటోతో నిర్దేశించిన క్యాంప్‌లకు హాజరు కావాలని కోరారు.

ఆకట్టుకున్న రోబోటిక్స్ నమూనాలు



ప్రాజెక్టును తిలకిస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వివా ది స్కూల్‌లో ఎడ్యుటెక్ ఇన్నోవేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఏఐ, రోబోటిక్స్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, 3డీ ప్రింటింగ్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యార్థులు రూపొందించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హ్యాండ్ రైటింగ్ మెషిన్, స్మార్ట్ మిర్రర్, ఆటోమేటిక్ ప్లాంట్ వాటరింగ్ సిస్టమ్ ఆకట్టుకున్నాయి. విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, తల్లిదండ్రులు అభినందించారు. వివా ప్రిన్సిపల్ చదలవాడ సరళ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను విద్యార్థులకు అందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎడ్యుటెక్ ఇన్నోవేషన్ ప్రతినిధి కె. కళ్యాణ్ మాట్లాడుతూ భవిష్యత్ సాంకేతికతను విద్యార్థులకు అందించేలా 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ప్రోగ్రాం రూపకల్పన చేశామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎలిటి కమాండర్ కేఎస్ రావు, సీబీఎస్ఈ సంధానకర్త జ్యోతి మెటిల్డా, పీవైపీ సంధానకర్త కె.మాధవి, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి



పెదకాకాని సెంటర్‌లో శాంతి ర్యాలీలో క్రైస్తవులు



ప్రత్తిపాడు తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

పెదకాకాని: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయించి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలని మండల పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ వి.ఎలీషా అన్నారు. పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతికి నిరసనగా మంగళవారం ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రైస్తవ సంఘాలు శాంతి ర్యాలీ చేపట్టాయి. పెదకాకాని మానవహారం ఏర్పాటు చేవారు. వి.ఎలీషా మాట్లాడుతూ.. మతోన్మాదులు చేస్తున్న మారణకాండకు చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా పెదకాకాని సెంటర్ నుంచి వై జంక్షన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు. అనంతరం పెదకాకాని సెంటర్‌లో కొవ్వొత్తులు వెలిగించారు. పెదకాకాని మండల పాస్టర్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్ విక్రాంత్‌వర్ధన్, సెక్రటరీ ఆర్ రాజశేఖర్, క్రిస్టియన్ ఫోరం లీడర్ ఎల్ సాల్మన్, పాస్టర్ ఆర్ అబ్రహాం, ఎం మరియదాసు, యోహాను, జయప్రకాష్, పెదకాకాని గ్రామ సర్పంచ్ గోళ్ళ స్వరూపరాణి శ్యామ్ ముఖర్జీ, ప్రభువు రక్షణ పి. జాను, ప్రకాష్, ఏఈఎస్‌సీ పాస్టర్లు విక్టర్ మోజేష్, రత్నబాబు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

గుంటూరు రూరల్: ప్రత్తిపాడులో మంగళవారం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ఫెలోషిప్ ఫౌండర్ మోజెస్ పాల్ మాట్లాడుతూ ప్రవీణ్ ప్రగడాల హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

'ప్రమాద' మలుపులు

- పలు రహదారుల్లో ప్రమాదకరంగా మలుపులు
- నిత్యం దుర్ఘటనలు జరుగుతున్నా పట్టని అధికారులు



చింతలపూడి గ్రామం ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

పొన్నూరు: మండలంలోని చింతలపూడి గ్రామం ప్రధాన రహదారిలోని మలుపులు ప్రమాదకరంగా మారాయి. పొన్నూరు పట్టణం నుంచి బాపట్ల, చీరాలకు వెళ్లే ప్రధాన ప్రధాన మార్గం కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. రద్దీగా ఉండే ఈ మార్గంలో విపరీతమైన మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చింతలపూడి గ్రామంలోని మలుపుతో పాటు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ప్రధాన రహదారిపై ఈ తరహా మలుపు ఉంది. వాహనాలు అత్యంత వేగంగా వస్తున్న సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. పలువురు గాయాలపాలైన సంఘటనలు జరిగినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

తప్పని ఆందోళన

మలుపుల్లో వేగ నిరోధకాలు, సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతోందని ప్రజలు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని రహదారిపై ఉన్న డివైడర్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు వాహనాలు డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాలు జరిగిన సమయంలో చిన్న సూచిక బోర్డు పెట్టి అధికారులు మమ అనిపిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రమాదాల నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద వేగ నిరోధకాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.



సూచిక లేని డివైడర్

డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పట్నంబజారు: డ్రైవర్లు బాధ్యతతో ప్రయాణికుల సంరక్షణే ధ్యేయంగా ముందుకు సాగాలని ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం గుంటూరు జిల్లా పరిధిలోని ఏపీఎస్ ఆర్టీసీ హెవీ మోటారు డ్రైవింగ్ వెహికల్ స్కూల్ 19 బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆర్ఎం రవికాంత్ మాట్లాడుతూ హెవీ మోటారు డ్రైవింగ్ స్కూల్ ద్వారా 25 సంవత్సరాల అనుభవం కలిగిన సీనియర్ డ్రైవర్లతో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థి రోడ్డు నియమాలు కచ్చితంగా పాటిస్తూ, మత్తు పానీయాలకు దూరంగా ఉంటూ, ఇంధనం పొదుపు చేసే విధంగా డ్రైవింగ్ నేర్చుకోవాలని సూచించారు. ప్రమాద రహిత డ్రైవింగ్ లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. నిత్యం గంట పాటు బస్సుకు సంబంధించిన పలు విభాగాల పనితీరు గురించి వివరించడంతో పాటు ప్రమాద హెచ్చరికలు, సిగ్నల్స్ వివరాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 20వ బ్యాచ్ ప్రవేశాల కోసం డ్రైవర్లు వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 8897371003కి సంప్రదించాలని కోరారు. స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

మండల స్థాయి అధికారుల సమావేశం



గుంటూరు రూరల్: ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవార మండల స్థాయి అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ అరుణకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. అడిషనల్ డీఎల్ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ కాప్ కార్యక్రమం ప్రాధాన్యత తెలిపారు. పీఎండీఎస్ గురించి చెప్పారు. కిట్ల కోసం నిధుల సేకరణకు సీసీతో, ఐసీఆర్‌పీలతో సమావేశం నిర్వహించి చర్చించారు. వీవోఏలకు, వీవో, ఓబీలకు రైతులకు విత్తన శుద్ధి విధానం చూపించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ కుమార్, యూనిట్ ఇన్‌చార్జి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.